TELTEL/2023/87917

# జనం వెలుగు

www.janamvelugu.com, janamvelugu2023@gmail.com

అనునిత్యం అక్షరసత్యం

**విలేఖర్లు కావలెను**

జనం వెలుగు న్యూస్ దినపత్రిక నందు పనిచేయుటకు తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా అన్ని ప్రాంతాలనుండి జిల్లా మరియు మండల విలేఖరులు కావలెను

ఆసక్తి కలవారు వెంటనే సంప్రదించండి

9603322119

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ | సంపుటి : 02 | సంచిక : 354 | శుక్రవారం 14 - 03 - 2025 | ఎడిటర్ : సీతార్ల సురేష్ | పేజీలు : 8 | వెల : 6/-

## మహిళలు ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలి

**కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు**
**టీఎన్జీవోల సంఘం ఆధ్వర్యంలో ఘనంగా మహిళా దినోత్సవం**

**జనం వెలుగు, నిజామాబాద్, మార్చి 13:** మహిళలు ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు సూచించారు. తెలంగాణ నాన్ గెజిటెడ్ అధికారుల యూనియన్ ఆధ్వర్యంలో గురువారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం సమావేశ మందిరంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, మహిళలు ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగితే అద్భుతాలు సాధించగలరని అన్నారు. ఏ రంగంలో ఉన్న బాధ్యతలు మర్చిపోవద్దని, అందుబాటులో ఉన్న అవకాశాలు సద్వినియోగం చేసుకుంటూ ముందుకు సాగాలన్నారు. మహిళా సాధికారతకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని గుర్తు చేశారు. మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సదుపాయం అందుబాటులోకి తెచ్చిందని, క్యాంటీన్ ల నిర్వహణ, యూనిఫాం లు కుట్టే బాధ్యతలను అప్పగించిందని అన్నారు. ప్రభుత్వ తోడ్పాటును సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కాగా, మహిళా ఉద్యోగులు ఇంటి పనులు, ఉద్యోగ విధులను సమన్వయం చేసుకుంటూ ఆరోగ్యాల పట్ల శ్రద్ధ తీసుకోవాలని కలెక్టర్ హితవు పలికారు. ఈ సందర్భంగా మహిళా ఉద్యోగులను, వివిధ రంగాలలో ప్రముఖంగా సేవలు అందిస్తున్న



మహిళలను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్ కుమార్, జిల్లా సంక్షేమ అధికారిణి రసూల్ బీ, జిల్లా పౌర సంబంధాల అధికారిణి నార్ల పద్మశ్రీ, జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారిణి కృష్ణవేణి, టీఎన్జీవో జిల్లా సంఘం అధ్యక్ష, కార్యదర్శులు సుమన్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రశ్నించే గొంతుకలపై సస్పెన్షన్ వేటు అప్రజాస్వామికం

**జగదీశ్ రెడ్డిపై సస్పెన్షన్ వేటు అప్రజాస్వామికం.**
**బిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు జీవన్ రెడ్డి.**

**జనం వెలుగు, ఆర్మూర్:–** అసెంబ్లీలో ప్రజావాణిని వినిపించేందుకు ప్రయత్నిస్తే ప్రశ్నించే గొంతులను ఈ కాంగ్రెసు ప్రభుత్వం నొక్కేస్తొందని ఆర్మూర్ మాజి ఎంఎల్ఏ బిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు జీవన్ రెడ్డి మండిపడ్డాడు. బిఆర్ఎస్ ఎంఎల్ఏ జగదీష్ రెడ్డి తన నియోజక వర్గపు ప్రజల వాణిని అసెంబ్లీలో వినిపించేందుకు ప్రయత్నిస్తే అసెంబ్లీ సేషన్ పూర్తి అయ్యే వరకు ఎంఎల్ఏ జగదీష్ రెడ్డిని సస్పెండ్ చేస్తున్నట్లు ప్రకటించడం కాంగ్రెసు ప్రభుత్వ దురహంకారానికి నిదర్శనమని ఆయన ఆందోళన వ్యక్తం చేశాడు. ప్రభుత్వ దుర్నీతిపై బయట ప్రశ్నిస్తే అక్రమ కేసులు పెట్టి జైళ్ళపాలు చేస్తున్నారని, అసెంబ్లీలో నిలదీస్తే సభ నుంచి గెంటేస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశాడు. జగదీశ్ రెడ్డికి మాట్లాడేందుకు అవకాశం ఇవ్వకుండా ఏలాంటి నోటీస్ ఇవ్వకుండా ఏకపక్ష నిర్ణయంతో సస్పెండ్ చేయడం దారుణమని ఆయన విమర్శించాడు. ప్రజల తరపున మాట్లాడేందుకు ప్రధాన ప్రతిపక్షానికి మైక్ ఇవ్వకుండా, ప్రజల పక్షాన పోరాడేవారి గొంతు నొక్కేయడమే ఇందిరమ్మ రాజ్యమా? అని జీవన్ రెడ్డి నిలదీశాడు. ఒక వేళ సభలో మాట్లాడేందుకు అవకాశం ఇస్తే కాంగ్రెస్ ప్రభుత్వ బండారం ఎక్కడ బయట పడుతుందనే భయంతోనే ఇలాంటి అక్రమ నిర్ణయాలు తీసుకుంటున్నారని ఆయన అన్నాడు. కాంగ్రెస్ ప్రభుత్వం నొక్కింది బీఆర్ఎస్ సభ్యుల గొంతుకాదని, యావత్ తెలంగాణ రాష్ట్ర ప్రజల గొంతు అని ఆయన మండిపడ్డాడు. కాంగ్రెస్ ప్రభుత్వ అప్రజాస్వామిక చర్యలను ఎండ గడుతూ ప్రజాక్షేత్రంలో పోరాడుతామని ఆయన తెలిపాడు. ప్రజా కోర్టులో కాంగ్రెస్ ప్రభుత్వానికి శిక్ష తప్పదని ఆయన హెచ్చరించాడు.

**జిల్లా వ్యాప్తంగా నిరసనలను చేపట్టండి.**

బీఆర్ఎస్ ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డిని బడ్జెట్ సమావేశాలు ముగిసేంత వరకు సభ నుంచి సస్పెండ్ చేయ డాన్ని నిరసిస్తూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఇచ్చిన పిలుపు మేరకు శుక్రవారం నిజామాబాద్ జిల్లా వ్యాప్తంగా



నిరసనలు, కాంగ్రెస్ ప్రభుత్వ దిష్టిబొమ్మల దగ్ధం వంటి కార్యక్రమాలను పెద్ద ఎత్తున నిర్వ హించనున్నట్లు ఆయన తెలిపాడు. పార్టీ ప్రజా ప్రతినిధులు, జిల్లా, మండల, గ్రామ స్థాయిలో పార్టీ శ్రేణులు ఈ నిరసన కార్యక్రమాలలో పాల్గొనాలని ఆయన పిలుపు నిచ్చాడు. అన్ని వర్గాల ప్రజలు, ప్రజాస్వామిక వాదులు ఈ ఆందో ళన కార్యక్రమాలలో పాల్గొని కాంగ్రెస్ ప్రభుత్వ నిరంకుశ పాలనను నిరసించాలని జీవన్ రెడ్డి విజ్ఞప్తి చేశాడు.

## ప్రభుత్వ పాఠశాలల్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా బోధన

**రాష్ట్ర విద్యా శాఖ కార్యదర్శి యెగితారాణా,**
**విద్యాశాఖ బలోపేతం, నూతన విద్యా విధానంపై వీ.సీ ద్వారా సమీక్ష**

**జనం వెలుగు, నిజామాబాద్, మార్చి 13:** ప్రభుత్వ పాఠశాలల్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా బోధన ప్రారంభించడం జరుగుతోందని రాష్ట్ర విద్యా శాఖ కార్యదర్శి యెగితారాణా అన్నారు. గురువారం ఆమె విద్యా శాఖ కమిషనర్ నర్సింహారెడ్డితో కలిసి హైద్రాబాద్ నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్లు, విద్యా శాఖ అధికారులు, ప్రోగ్రాం, క్వాలిటీ అధికారులతో సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా యెగితా రాణా మాట్లాడుతూ, SCERT తెలంగాణ ఆధ్వర్యంలో సమగ్ర శిక్ష తెలంగాణ విద్యాశాఖ మౌళిక భాషాగణిత సామర్థ్యాల సాధన కార్యక్రమంలో (FLN) లో కృత్రిమ మేధను ఉపయోగించి బోధన ను మెరుగుపరచడానికి axl , Ekstep ఫౌండేషన్ సహకారంతో మొదటి దశలో పైలెట్ ప్రాజెక్టు గా 6 జిల్లాల్లో ప్రారంభించిందని అన్నారు. ఆయా జిల్లాలలో మెరుగైన ఫలితాలు ఉన్నందున రాష్ట్రంలోని మిగిలిన అన్ని జిల్లాలలో కూడా ఈనెల 15 వ తారీకున ప్రారంభించాలని, సంకల్పించామని, ప్రతి జిల్లా నుండి ఒక క్వాలిటీ కంట్రోలర్, ఒక మండల విద్యాశాఖాధికారి, ఒక పాఠశాల సముదాయ ప్రధానోపాధ్యాయులు, ఒక ప్రాథమిక పాఠశాల ఉపాద్యాయుడు ఇలా ప్రతి జిల్లా నుండి నలుగురికి రాష్ట్ర స్థాయిలో శిక్షణ ఇప్పించామని తెలిపారు. ప్రభుత్వం పలు కార్యక్రమాలను అమలు చేస్తున్నా, ప్రాథమిక స్థాయిలో భాషలో అభ్యసనా సామర్థ్యాలు, అలాగే గణితంలో చతుర్విధ ప్రక్రియల్లో వెనకబాటులోనే ఉంటున్నారని. ఈ విషయాన్ని వివిధ విద్యా



పరిశోధన, సర్వే సంస్థలు కూడా వెల్లడి చేస్తున్నాయన్నారు. ఈ క్రమంలో కృత్రిమ మేధ సాయంతో ప్రాథమిక పాఠశాలల్లో ప్రధానంగా 3, 4, 5 తరగతుల విద్యార్థుల్లో మెరుగైన అభ్యసన సామర్థ్యాలను సాధించడం కోసం కృషి జరుగుతుందన్నారు. వీడియో కాన్ఫరెన్స్ లో కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు, అదనపు కలెక్టర్ అంకిత్, జిల్లా విద్యా శాఖ అధికారి అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా ప్రజలకు హెూళీ శుభాకాంక్షలు : కలెక్టర్



**జనం వెలుగు, నిజామాబాద్, మార్చి 13:** హెూళీ పండుగను పురస్కరించుకుని కలెకర్ రాజీవ్ గాంధీ హనుమంతు జిల్లా ప్రజలకు హెూళీ వేడుక శుభాకాంక్షలు తెలియజేశారు. రాగద్వేషాలకు అతీతంగా అందరినీ ఒక్కచోట చేర్చే ఈ హెూళీ వేడుక ప్రజలందరి జీవితాలలో సంతోషపు వెలుగులు నింపాలని ఆకాంక్షించారు. జిల్లా ప్రజలు ఆనందోత్సాహాలతో హెూళీ వేడుక జరుపుకోవాలని అభిలషించారు. సహజ రంగులను వినియోగిస్తూ సంప్రదాయబద్ధంగా హెూళీ నిర్వహించుకోవాలని హితవు పలికారు.

## తలంబ్రాలు మీ ఇంటికే - తపాలా శాఖ ప్రత్యేక సేవలు

**జనం వెలుగు, నిజామాబాద్:–** నిజామాబాద్ సీనియర్ సూపరింటెండెంట్ కె. జనార్దన్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీరామ నవమి సందర్భంగా భక్తులు భద్రాచలంలో శ్రీ సీతారామ కళ్యాణాన్ని ప్రత్యక్షంగా దర్శించలేని పరిస్థితిని దృష్టిలో ఉంచుకొని, భారత తపాలా శాఖ తెలంగాణా రాష్ట్ర దేవాదాయశాఖతో ఒప్పందం చేసుకొని ప్రత్యేక సేవలను అందిస్తోంది. భద్రాచలం వెళ్లలేని భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవచ్చు. స్పీడ్ పోస్ట్ ద్వారా భద్రాచల సీతారామ స్వామి కళ్యాణ తలంబ్రాలు (అంత్రలయార్చన) (10gms), 1 ముత్యం, పసుపు, కుంకుమ, మిస్రి, కాజు (80 gms) ప్రసాదం మీ ఇంటికే పంపబడుతుంది. భక్తులు తమ దగ్గర్లోని పోస్ట్ ఆఫీసులో రూ.450/– చెల్లించి బుక్ చేసుకోవచ్చు. అదనంగా, శ్రీరామ కళ్యాణ తలంబ్రాలు 20gms మరియు 1 ముత్యం కోసం రూ.150/– చెల్లించి పొందగలరు. ఈ ప్రత్యేక సేవలు 12.03.2025 నుండి 01.04.2025 వరకు మాత్రమే అందుబాటులో ఉంటాయి. భక్తులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని పోస్ట్ ఆఫీస్ సీనియర్ సూపరింటెండెంట్ సూచించారు.

## ఎస్సి వర్గీకరణను అమలు చేసేంత వరకు ఉద్యోగ నియామకాలు ఆపాలి

**మాట మీద నిలబడని సిఎం రేవంత్ రెడ్డి**
**అబద్ధాలు చెప్పి నమ్మించటంలో దిట్ట రేవంత్ రెడ్డి**
**రేవంత్ రెడ్డిని రాజకీయంగా బొంద పెట్టేది మాదిగలే**
**మూడవ రోజుకు చేరిన నిరసన దీక్ష**
**ఎంఆర్ పిఎస్ జిల్లా అధ్యక్షుడు కనక ప్రమోద్ మాదిగ**



**జనం వెలుగు ఆర్మూర్:–** ఎస్సీ వర్గీకరణను చట్టాన్ని అమలు చేసేంత మట్టుకు ఉద్యోగ నియామకాలను నిలపాలని ఎంఆర్ పిఎస్ జిల్లా అధ్యక్షుడు కనక ప్రమోద్ మాదిగ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాడు. రాష్ట్ర ప్రభుత్వం యొక్క తీరును నిరసిస్తూ జరుగుతున్న నిరసన దీక్షలు గురువారం మూడవ రోజుకు చేరుకున్నాయని ఆయన తెలిపాడు. ఈ దీక్షకు జిల్లా మోచి సంఘం సంఘీభావం తెలపడం జరిగిందని ఆయన అన్నాడు. సిఎం రేవంత్ రె డ్డి, మాలల ఒత్తిడికి తలొగ్గి మాది గలను మోసం చేస్తున్నాడని, దీనికి సాక్ష్యం నిండు అసెంబ్లీలో రేవంత్ రెడ్డి మాట్లాడిన మాటలు మీద నిలబడకపోవడమని ఆయన ఎద్దేవా చేశాడు. ఆగస్టు 1న సుప్రీం కోర్టు వర్గీకరణ మీద ఇచ్చిన తీర్పును స్వాగతించి, గతంలో ఇచ్చిన నోటిఫికేషన్లకు కూడా వర్గీకరణ అమలు చేసి మాదిగలకు న్యాయం చేస్తామని చెప్పింది వాస్తవం కాదా అని ఆయన ప్రశ్నించాడు. ఒకవైపు మాదిగల మీద ప్రేమ ఉన్నది అంటూనే మరో వైపు మాదిగలకు అన్యాయం చేస్తూ ఉద్యోగ నియామకాలు జరపడం ఎంతవరకు సమంజసమని ఆయన ప్రశ్నించాడు. మాదిగలను, మాదిగ ఉపకులాలను మోసం చేసిన రాజకీయ పార్టీలు చరిత్రలో నిలబడలేవని ఆయన అన్నాడు. రేవంత్ రెడ్డి ప్రభుత్వంతో మాదిగలు తాడో పేడో తేల్చుకునే రోజు దగ్గర పడిందని ఆయన అన్నాడు. నిరసన దీక్షలు టెంట్ కిందనే ఉన్నావని, భవిష్యత్తులో మాదిగల నిరసన కార్యక్రమాలు రోడ్ల మీదకు వచ్చేలా రేవంత్ రెడ్డి చేశాడని ఆయన తెలియచేయడం జరిగింది. ఈ దీక్షలో ఎంఆర్ పిఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు రొడ్డ ప్రవీణ్ మాదిగ, ఎంఎంఎస్ జాతీయ నాయకురాలు యమున, సత్తెక్క, ఎంఆర్ పిఎస్ టౌన్ అధ్యక్షుడు మహేష్ మాదిగ, ఎంఎస్పి జిల్లా నాయకుడు రామచందర్ మాదిగ, ఎంఎంఎస్ జిల్లా నాయకురాలు స్వప్న మాదిగ, మోచి కుల సంఘ సభ్యులు పాల్గొన్నారు.

## ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయండి

**మాజి మంత్రి, బాల్కొండ ఎంఎల్ఏ వేముల ప్రశాంత్ రెడ్డి**



**జనం వెలుగు, ఆర్మూర్:–** గత అసెంబ్లీ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని సభలో ప్రశ్నిస్తే సభ నుండి జగదీష్ రెడ్డిని సస్పెండ్ చేశారని మాజి మంత్రి బాల్కొండ ఎంఎల్ఏ వేముల ప్రశాంత్ రెడ్డి విమర్శించాడు. సభ అందరిదని, సభలోని సభ్యులందరికీ సమాన హక్కులుండాలని, కాంగ్రెసు పార్టీకి సంబంధించిన సభ కాదని అన్నందుకే సభ్యుడు జగదీష్ రెడ్డిని సస్పెండ్ చేశారని ఆయన అన్నాడు. రైతులకు రుణమాఫీ, రైతు భరోసా, మహిళలకు 2500, వృద్ధా ప్య పించన్లు, నిరుద్యోగులకు 4000 ఇస్తామని ఇవ్వలేదని హామీల అమలు చేయడం లేదని సభలో జగదీశ్ రెడ్డి ప్రస్తావించారని ఆయన తెలిపాడు. దీనిపై స్పీకర్ ను జగదీష్ రెడ్డి అవమానపరిచేలా వ్యాఖ్యలు చేశారంటూ నిందలు వేశారని, దీనిపై రాద్ధాంతం చేస్తూ దాదాపు నాలుగు గంటల పాటు సభ నిలిపి వేశారని ఆయన అన్నాడు. దీనిపై మా నాయకుడు కేసీఆర్ కి వివరించడం జరిగిందని, మేం తప్పుమాట్లాడకున్నా స్పీకర్ కి హుందాగా విచారం వ్యక్తం చేసి సభను హుందాగా నడిపేలా చూడాలని మాకు సూచన ఇచ్చారని ఆయన అన్నాడు. తప్పు చేయకున్నా స్పీకర్ కు క్షమాపణలు చెప్పి సభ నడిచేలా చూడాలని కేసీ ఆర్ మమ్మల్ని కోరారని ఆయన అన్నాడు. సిఎం ఢిల్లీలో ఉన్నాడని, సభ నడిపిస్తారా లేదా అని స్పీకర్ ని కోరామని సభలో జరిగిన దానిపై రికార్డులు పరిశీలించాలని ఒక వేళ తప్పు ఉంటే జగదీశ్వర్ రెడ్డి విచారం వ్యక్తం చేస్తారని మేం చెప్పామని ఆయన తెలిపాడు. ఇంత వరకు దీనిపై ఏలాంటి నిర్ణయం తీసుకోలేదని ప్రజా సమస్యలపై ప్రజల పక్షాన పోరాడేందుకు మేము సిద్ధంగా ఉన్నామని సభను నిర్వహించాలని కోరిన, ఏమీ లేకున్నా ఏదో జరిగినట్లు నాలుగు గంటల పాటు సభను వాయిదా వేయడం జరిగిందని ఆయన తెలిపాడు. జగదీష్ రెడ్డి వ్యాఖ్యలపై రికార్డులని అఖిలపక్షాన్ని పిలిచి పరిశీలించండని, ప్రతిపక్షం గొంతు నొక్క వద్దని మేము ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తు న్నామని ఆయన వివరించాడు.

## ఈ నెల 15 నుండి ఒంటి పూట బడులు

**జనం వెలుగు, బాల్కొండ:–** జిల్లా విద్యాశాఖ అధికారుల ఆదేశాల మేరకు ఈ నెల 15 నుండి ఒంటి పూట బడులు ప్రారంభమై ఏప్రిల్ 23 వరకు ఒంటి పూట బడులు కొనసాగుతాయని బాల్కొండ మండల విద్యాశాఖాధికారి రాజేశ్వర్ తెలిపాడు. ప్రాథమిక, ఉచ్చతర ప్రాథమిక పాఠశాల, ఉన్నత పాఠశాలలు, ప్రైవేటు మేనేజ్ మెంట్ ఉదయం 8 గంటల నుండి 12.30 విధులను నిర్వహిస్తాయని, మధ్యాహ్న భోజనం విద్యార్థులకు అందించాలని ఆయన అన్నాడు. పదవ తరగతి పబ్లిక్ పరీక్షల కోసం విద్యార్థులను సంసిద్ధం చేయడానికి ప్రత్యేకమైన తరగతులు కొనసాగుతాయని, ఎస్ఎస్సి పరీక్ష కేంద్రాలు గల పాఠశాలల మధ్యాహ్నం ఒంటిగంట నుండి సాయంత్రం 5 వరకు కొనసాగుతాయని ఆయన వివరించాడు.